పోస్టర్ల ఆవిష్కరణ



మహబూబ్ నగర్ : చెక్‌ముఖి సైన్స్ సంబురాలు 2023 24 ఏడాదికి సంబంధించిన ప్రచార పోస్టర్ను ఆవిష్క రించి నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్ గౌడ్, వేణుగోపాల్ తెలిపారు. గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ చేతుల మీదుగా ఈ పోస్టల్ విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ విద్యార్థుల కు ఈ సైన్ సంబురాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. జన విజ్ఞాన వేదిక నిర్వహించే సైన్స్ పోటీలలో జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల విద్యార్థులందరూ తప్పక పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్మ, ప్రాలాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెట్‌ను మినహాయించాలి : టీఎస్ యూటీఎఫ్

మహబూబ్ నగర్ : ఉపాధ్యాయ పదోన్నతుల కోసం టెట్ నుంచి మినహాయించాలని తెలంగాణ తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం నూతన సంవత్సర కాలమానినీ టీ. ఎస్. యూటీ ఎఫ్ మాజీ కోశాధికారి ఎస్. కిష్టయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. వెంకటేష్, కె. రవికుమార్ లు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు 8 సంవత్సరాలుగా పదోన్నతులు లేక ఒకే క్యాడర్ లో పదవీ విరమణకు దగ్గరగా ఉన్నారని, తీరా ఇప్పుడు టెట్ అర్హత ఉండాలని అంటున్నారని, అప్పుడే నిర్వహించి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదని టెట్ నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్షానికి ఉపాధ్యాయును బలి చేయొద్దని నూతన ప్రభుత్వమైన ఉపాధ్యాయులకు పదోన్నతులకు టెట్ నుంచి మినహాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు కనకమ్మ, అజయ్, జిల్లా కమిటీ సభ్యులు శంకరయ్య, రాములు, ఖాదరయ్య, జవెద్, ఫరూక్, శ్వేత, భారతి, మాదిరి,శంకర్, రాజేష్ యాదవ్, నరేష్,, రాకేష్, భాస్కర్, నాసర్ బిన్ పాల్గొన్నారు.

'ఆటోవాల'కు ఆదరణ కరువు

- నాడు క్యాబులు నేడు ఉచిత ప్రయాణం
- మహిళలకు ఉచితం పేరుతో కష్టాల్లో ఓనర్లు
- గాడితప్పిన ఆటో కార్మికుల బతుకులు
- ఉపాధి చూపకుండా

నోట్ల మట్టి కొట్టారని ఆగ్రహం

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

ఆటోవాడ్ని అందరికీ సొంతవాడ్ని... అని రజినీకాంత్ పాడిన పాట వింటే మనకు ఆటో కార్మికుల బతుకులు ఎంత దుర్భరంగా ఉంటాయో తెలస్తోంది. పొట్టకూటి కోసం స్టీరింగ్ పట్టి ఉదయం నుంచి రాత్రి పగలు తేడా లేకుండా ప్రయాణికులను తమ గమ్యాలకు చేర్చుతారు. అందరు పండగలు ఉత్సవాలలో ఉంటే ఆటో కార్మికులు మాత్రం ప్రయాణికులను చేరవేస్తారు. అయితే ఇప్పుడు వీరి బతుకులు రోడ్డున పడ్డాయి. ఆటోవారి బతుకులను ఆగం చేయొద్దని రెండు చేతులు జోడించి మొక్కుతున్నారు. ఆటో కార్మికులు. మహిళలకు ఉచిత ప్రయాణం పేరుతో బతుకులు ఆగం చేయకుండా కాపాడాలని కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఆటో రంగంపై ఆదారపడి జీవిస్తున్న వారి బతుకులు అగమ్యగోచరంగా మారాయి. రవారణ రంగం మీద ఆధార పడి జీవిస్తున్న వారికి ప్రత్యమ్నాయం చూపకుండా మహిళలకు ఉచిత ప్రయాణం ప్రకటన చేయడం సరికాదని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల మంది ఉంటే ఉమ్మడి జిల్లాలోనే 2.50 లక్షల మంది ఉన్నారు. ఆటో కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదలేసే విదంగా విధానాలు ఉండటం వల్ల వీరంతా రోడ్డున పడుతున్నారు. రోడ్డున పడ్డ ఆటో కార్మికుల కోసం ఎటువంటి చర్యలు చేపడతారో ప్రకటన చేయడం లేదు. ముఖ్యంగా అద్దెకు ఆటోలు తీసుకొని నడుపుకుంటున్న వారి ఆటోలు ఆగిపోయాయి. బ్యాంకులు, ఫైనాన్స్‌ల నుంచి రుణాలు తీసుకొని వాహనాలు తీసుకున్న వారికి ఈఎంఐ చెల్లించలేక ప్రైవేటు అప్పుల పాలవుతున్నారు. ఎన్నికల సమయంలో ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామని చెప్పారు ఇప్పుడవి ఏవీ అమలు చేయకుండానే హామీలను అమలు చేయడంతో వీరి కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నాయి.

చితికి పోతున్న బతుకులు..

ఆటో కార్మికుల బతుకులు చితికి పోతున్నాయి. ముఖ్యంగా పూట గడావాలంటే ఆటో నడవాలి. ఇప్పుడు ఆటో నడవకుంటే వీరు నిర్మాణ రంగ కూలీలుగా మారాల్సి వస్తోంది.అంటె అద్దెలు, బడి ఫీజులు, పాలు, విద్యుత్ బిల్లులు చెల్లించలేక పోతున్నారు. అరకొర వసతులతో కాలం వెల్లదీస్తున్న కార్మికులకు మూలిగె నక్కపై తాటికాయ పడ్డట్లుగా ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే ఆటోకార్మికుల పట్ల సానుకూల వైఖరితో ప్రత్యమ్నాయ చర్యలు తీసుకోవాలని పలు పార్టీలు ప్రజాసంఘాల వారు కోరుతున్నారు.



ఆటో కార్మికులను ఆదుకోవాలి..

జిల్లాలో ఆటో కార్మికులు వేలాదిమంది ఉన్నారు. ఆటోలను రెంటుకు తీసుకొని జీవనంసాగించే వారికి అద్దెను చేతిగుంటా చెల్లిస్తున్నారు. బతుకులు ఆగం అవుతున్నాయి. అనేక రూట్లో ఆటోలకు బదులు బస్సుల్లో వెల్తున్నారు. ఉచితం పేరుతో బస్సులను నడపడం మాకు అభ్యంతరం లేదు. కాని ఆటో కార్మికులను ఆదుకోవడం కూడా సామాజిక బాధ్యత అన్న విషయం పాలకులు గుర్తించాలి.



– పొదిల రామయ్య,
సీఐటీయూ జిల్లా కార్యదర్శి, నాగర్‌కర్నూల్.

కేటీఆర్‌వి పిచ్చి అరుపులు



- ప్రజా ప్రభుత్వ పాలనలో పేదలందరికీ న్యాయం
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వినోద్ కుమార్

మహబూబ్ నగర్ : తెలంగాణలో అధికారం కోల్పోయిన బాధలు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారక రామారావు మాటలు పిచ్చి అరుపులు అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వినోద్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 30 రోజుల పాలనలపై 420 పుస్తకం విడుదల చేయడం చూస్తే అధికారం కోల్పోయిన మన బాధలో వారు ఉన్నట్లు తెలుస్తుందన్నారు. నీళ్లు నిధులు నియామకాల కోసం పోరాడి సాధించిన తెలంగాణలో 9 ఏండ్ల పాలనలో ఏం సాధించారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. మీ ప్రభుత్వ అవనీతి, అహం కార పాలనపై పోరాడి కాంగ్రెస్ గెలిచిందని తెలిపారు. దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి, ఎస్సీ మైనారిటీ రిజర్వేషన్లు పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. లక్షలాదిమంది నిరుద్యోగులకు అన్యాయం చేయలేదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ పాలనలో కేజీ టు పీజీ విద్య ఎక్కడ పోయిందని పరీక్షలంటే లీకేజీలే అంటూ ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన చరిత్ర మీకు ఉంది అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 30 రోజులలో ఇచ్చిన హామీలలో రెండు గ్యారెంటీలు అమలు చేశామని, రాష్ట్ర చరిత్రలోనే ఇప్పటివరకు 6.50 కోట్ల మహిళలు ఉచిత ప్రయాణం చేశారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ది పొందే ఉద్దేశంతో విమర్శలు చేస్తున్నది తప్ప మీకు ఎక్కడ సీట్లు రావని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు వచ్చిన ఓట్ల కన్నా 20 శాతం అధికంగా వస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనలో అర్హులైన పేదలందరికీ న్యాయం జరుగు తుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి సిరాజ్ కాద్రి, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనర్, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలన'ను పరిశీలించిన కలెక్టర్



బాలానగర్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని గురువారం మహబూబ్‌నగర్ కలెక్టర్ రవి నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు ప్రజా పాలన పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జి.రవినాయక్ హెచ్చరించారు. షెడ్యూల్ ప్రకారం గ్రామ సభను నిర్వహించాల్సి ఉండడం ఈ విషయం ముందే తెలిసినప్పటికీ గ్రామ సభ నిర్వహణకు సరైన ఏర్పాట్లు చేయకపోవడం, దరఖాస్తులు సమర్పించేందుకు ప్రజలు వచ్చినప్పటికీ సకాలంలో దరఖాస్తులు స్వీకరించలేకపోవడం వంటి కారణాలవల్ల బాలనగర్ మండలంలోని జీడిగుట్ట తండా గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి కి షోకజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. బాలానగర్ మండలం, జీడిగుట్ట తండాలో నిర్వహిస్తున్న ప్రజాపాలన గ్రామ సభను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దరఖాస్తులు సమర్పించేందుకు ప్రజలు క్యూ లైన్లలో నిలబడి దరఖాస్తులు సమర్పించేందుకు ఎవరూ లేకపోవడంతో పాటు, గ్రామసభలో ప్రజలకు అవసరమైన ఏర్పాట్లు సరిగా చేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగానే నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం సరైన ఏర్పాట్లు చేయడకపోవడం పట్ల ఆయన ఆగ్రహారం వ్యక్తం చేస్తూ పంచాయతీ కార్యదర్శి విజయలక్ష్మి కి షోకాజ్ నోటీసు జారీ చేయాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చిన లబ్దిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. కొంతమంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు సమర్పించాల్సి ఉందని తెలుపగా, రేషన్ కార్డుల కోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ బాబురావు, ఎంపీడీవో కృష్ణారావు, సర్పంచ్‌తోపాటు వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ను 15 రోజులు పూర్తి చేయండి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్‌రావు

మహబూబ్‌నగర్ : ఈ సంవత్సరం వానకాలానికి సంబంధించి మిగిలిపోయిన సీఎంఆర్ (కష్టం మిల్లింగ్ రైస్) ను 15 రోజుల్లో పూర్తి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్ .మోహన్ రావు అన్నారు.. గురువారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలోని ఎన్ఐసీ సమావేశ మందిరంలో వానాకాలం సీఎంఆర్ చెల్లించాల్సిన రైస్ మిల్లర్లు, రైస్ మిల్లుల అసోసియేషన్ బాధ్యులు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వానకాలానికి సంబంధించి 1,39 వేల 330.920 మె. ట సి ఎం ఆర్ ను మిల్లర్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు 82905.20 మె. ట సిఎంఆర్ ను చెల్లించి 89శాతం సమర్పించారని ,తక్కిన 10446.466 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ను 15 రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లో సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం సీఎంఆర్ చెల్లించనట్లయితే సంబంధితులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, రెవెన్యూ రికవరీ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 15 రోజుల్లో వానకాలం సీఎంఆర్ సమర్పించడంతో పాటు, రబీకి సంబంధించి సీఎంఆర్ సమర్పించడం ప్రారంభించాలని అన్నారు. వానాకాలం సీఎం ఆర్ పూర్తి చేసిన రైస్ మిల్లర్లు జిల్లాలో రబీకు సంబంధించిన సీఎంఆర్ నుఇప్పటివరకు 18 శాతం సమర్పించారని తెలిపారు .ఈ రబీలో 1,12,770.68 మె. ట సీఎంఆర్ ను చెల్లించేందుకు నిర్దేశించగా ఇప్పటివరకు 13845.800మె. టన్నుల సిఎంఆర్ ను ప్రభుత్వానికి చెల్లించారని పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దారులు ప్రతిరోజు మిల్లులను తనిఖీ చేసి సీఎంఆర్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ ప్రవీణ్ కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు కృష్ణయ్య, సెక్రటరీ విజయకుమార్ , ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసీల్దారులు,సీఎంఆర్ చెల్లించాల్సిన రైస్ మిల్లుల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రజల ఆకాంక్షల మేరకే పాలన : మంత్రి జూపల్లి

నవతెలంగాణ - మహబూబ్ నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎంతో మంది ప్రాణ త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అమరవీరులు, ప్రజల ఆకాంక్షలు, అభీష్టం మేరకు స్వచ్ఛమైన, పారదర్శకమైన, అవినీతి రహిత ప్రజాపాలన చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర ఆబ్కారీ, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఇందుకు అనుగుణంగా అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజలు హర్షించే విధంగా కృషి చేయాలని మంత్రి ఆదేశించారు. గురువారం ఉదయం నాగర్ కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఎమ్మెల్సీ కుచుకుళ్ళ దామోదర్ రెడ్డి,సుకుంట్ల దామోదర్ రెడ్డి, గోరటి వెంకన్న, పార్లమెంట్ సభ్యులు రాములు, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, జడ్పీ చైర్మన్ శాంత కుమారి, జిల్లా కలెక్టర్ ఉదయ్ కుమార్ నాగర్ కర్నూల్ తో కలిసి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలు పోరాటం చేసి ఎంతోమంది ప్రాణ త్యాగాలు చేసి విద్యార్థులు, ఉద్యోగులు సకల జనులు పోరాటం చేసినందుకు అప్పటి కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిందని అన్నారు. కానీ అమరవీరుల ఆకాంక్ష, ప్రజల అభీష్టం మేరకు గత ప్రభుత్వం పరిపాలన చేయ లేదని ప్రజలు ఆగ్రహించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని తెలిపారు. అందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమరవీరుల ఆకాంక్షలు నెరవేరే విధంగా ప్రజల అభీష్టం మేరకు ప్రజాపాలన కొనసాగిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన, పారదర్శక పాలన అందించేందుకు అధికార యంత్రాంగం - ప్రజాప్రతినిధులు కంకణ బ ద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారం, సంక్షేమ పథ కాల అమలు, అభివృద్ధిలో నాగర్ కర్నూల్ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలిపి , నూతన ఒరవడికి నాంది పలుకుదామని దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయా శాఖల వారీగా మంత్రి సమీక్ష నిర్వహించారు. అందులో అతి ప్రధానమైన మిషన్ భగీరథ, ఇరిగేషన్, పౌర సరఫరాలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, రోడ్లు భవనాలు, విద్యుత్, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖల పై సమీక్ష నిర్వహించారు. మొదటగా మిషన్ భగీరథ పై సమీక్ష నిర్వహిస్తూ వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఎక్కడ తాగు నీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. దాదాపు 41వేల కోట్ల నిధులతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం చేపట్టిందని, కానీ సరైన ప్రణాళిక లేక పర్యవేక్షణ సరిగ్గా లేక మిషన్ భగీరథ పథకం లోపభూయిష్టంగా తయారైందన్నారు. ఇప్పటికీ చాలా గ్రామాల్లో ఇళ్లకు మిషన్ భగీరథ నీరు అందటం లేదన్నారు. అసలు నిర్వహణ చాలా అధ్వాన్నంగా ఉందనీ నిర్వహణకు అవసరమైన సిబ్బంది లేక కలుషిత నీరు సరఫరా కావడంతో ప్రజలు నీళ్ళు తాగటం లేదన్నారు. తమ నియోజకవర్గంలోని చాలా ఆవాసాలకు మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, వంశీకృష్ణ, ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తెచ్చారు. దీనిపై మంత్రి అధికారులను వివరణ కోరగా. సమగ్ర సమాచారం, వివరణ రాకపోవడంపై మంత్రి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం పదిరోజుల్లో అన్ని గ్రామాల్లో సూక్ష్మ స్థాయిలో పరిశీలన చేసి సమస్యల పై నివేదిక సమర్పించాలనీ అందుకు జిల్లా కలెక్టర్ బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. మిషన్ భగీరథ ఏజెన్సీలకు బిల్లులు గుడ్డిగా చెల్లించవద్దని, ఆవాసాలకు ఎంత తాగునీరు సరఫరా అయ్యింది అనే నివేదిక పై స్థానిక ప్రజా ప్రతినిధులతో పాటు గ్రామ మహిళా సమాఖ్య సంతకాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలని, మహిళల సంతకం లేకుండా బిల్లులను జనరేట్ చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అనంతరం ఇరిగేషన్ పై సమీక్షిస్తూ పాలమూరు రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంత నిధులు ఖర్చు చేశారు, ఇంకా ఎంత పని మిగులు ఉందని అధికారులను ప్రశ్నించారు. ఇప్పటి వరకు 30-40 శాతం పని పూర్తి కాలేదని, అసలు ప్రధాన కాలువల పని అలాగే పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ఇరిగేషన్ పై పూర్తి వివరాలు సిద్ధం చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. పౌర సరఫరాల శాఖ సమీక్షిస్తూ ఇప్పటి వరకు ఎంత వరి ఏ ఏ మిల్లులకు ఇచ్చాము, ఎఫ్.సి. ఐ కి తిరిగి ధాన్యం ఎంత ఇవ్వడం జరిగింది, ఇంకా పెండింగ్ ఎంత ఉందో మండలం వారీగా నివేదిక సిద్ధం చేసి ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. ఇచ్చిన వరికి ధాన్యం ఇవ్వకుండా ఉన్న మిల్లుల పై ఆర్ అండ్ ఆర్ యాక్టు కింద రికవరీ పెట్టాలని మంత్రి ఆదేశించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.500 గ్యాస్ పంపిణీ పథకం అమలు కోసం కసరత్తు ముమ్మరం చేసిందని, గ్యాస్ కనెక్షన్లపై పూర్తి వివరాలను సేకరించాలన్నారు. జనవరి 31 లోగా గ్యాస్ కనెక్షన్ లేని కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్య శాఖ, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖల పై సైతం సమీక్ష నిర్వహించి త్వరలోనే ఒక్కో శాఖ వారీగా సమీక్ష నిర్వహిస్తామని అందువల్ల శాఖకు సంబంధించిన పూర్తి నివేదికలు వారంరోజులు ముం దుగానే ఆయా శాసన సభ్యులకు, తనకు అందజేయాలని అదేశించారు. అచ్చంపేట శాసన సభ్యులు డా. వంశీ కృష్ణ మాట్లాడుతూ అచ్చంపేట నియోజక వర్గంలోనీ చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు రావడం లేదని, అందువల్ల బోర్లు వేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని మంత్రిని కోరారు. ఇరిగేషన్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గానికి సాగు నీటికి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద నార్లపూరు నుండి నీరు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులను సూచించారు. ఇంజనీరింగ్ శాఖకు సంబంధించి ఎస్. డి.ఎఫ్. కింద చేసిన పనులు నాణ్యత లేవన్నారు. క్వాలిటీ కంట్రోల్ ధృవీకరణ, ఇంజనీరింగ్ అధికారుల పరిశీలన లేకుండా బిల్లులు చెల్లించవద్దని అధికారులను ఆదేశించారు. అచ్చంపేటలో వంద కడకల ఆసుపత్రి ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో తగిన సిబ్బంది, వైద్య యూనిట్లు లేవని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 168 మంది వైద్య సిబ్బంది ఉండాలని, అందుకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి వైద్య శాఖకు పంపించాలని తెలియజేశారు. ఐ.సి.యు. వెంటిలేటర్ లేకుండా ఎలా పనిచేస్తాయని ప్రశ్నించారు. డయాలసిస్, సెంట్రల్ ఆక్సిజన్ యూనిట్లు అవసరం ఉన్నట్లు ప్రతిపాదనలు పంపించాలని వైద్య అధికారులను ఆదేశించారు. కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి సైతం అచ్చంపేట శాసన సభ్యులు లేవనెత్తిన అంశాలనే సమీక్షలో లేవనెత్తారు. మిషన్ భగీరథ, వైద్యం, ఇంజనీరింగ్ పై అధికారులకు ప్రశ్నలు సంధించారు. ఇప్పటివరకు చేపట్టిన పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు పి. రాములు మాట్లాడుతూ పౌర సరఫరాల శాఖ పై సమీక్ష చేయాల్సిన అవసరం ఉందని మంత్రి దృష్టికి తెచ్చారు. రఘుపతి పేట కల్వకుర్తి మధ్య ఉన్న రామగిరి వంతెన ప నులు ఆగిపోయాయని దానిని పూర్తి చేస్తే ప్రజల రాకపోకలకుచాలా సౌకర్యవంతంగా ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. వెంటనే స్పందించిన మంత్రి రామగిరి వంతెన పనులు తిరిగి ప్రారంభించాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ కుచుకుళ్ల దామోదర్ రెడ్డి, నాగర్ కర్నూల్ శాసన సభ్యులు కే. రాజేష్ రెడ్డి, కలెక్టర్ పి. ఉదయ్ కుమార్, జెడ్పీ చైర్మన్ శాంత కుమారి, ఎస్పీ వైభవ్ గైక్వాడ్, లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ సీతారామ రావు, జడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు పాల్గొన్నారు.



మత్స్యకారులకు సంక్షేమ ఫలాలు

- కొత్త అధ్యక్షుడిగా గంజి ఆంజనేయులు



మహబూబ్ నగర్ : మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న మత్స్యకారులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తానని జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కొత్త అధ్యక్షులు, చీప్ ప్రమోటర్ గంజి ఆంజనేయులు అన్నారు. గురువారం నూతన జిల్లా కమిటీని ప్రభుత్వం జిల్లా మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డి రాధా రోహిణి ఆధ్వర్యంలో కమిటీ డైరెక్టర్లను నియమించింది. జిల్లా అధ్యక్షులు చీఫ్ ప్రమోటరుగా గంజి ఆంజనేయులు, మరో 10 మంది డైరెక్టర్లను ఎన్నుకున్నారు. డైరెక్టర్ గా కావలి కృష్ణయ్య, పారుపల్లి, అడ్డాకుల మండలానికి చెందిన ఒకటి లక్ష్మీనరసింహ, డీ. ఆనంద్ యన్మంగండ్ల, బీ. వెంకట రాములు దేవరకద్ర, తిరుపతయ్య వేపూరు, పిట్టల మురళి జడ్చర్ల, మాధవయ్య, రామచంద్రయ్య మీరేటి లక్ష్మయ్య డైరెక్టర్లుగా ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గంజి ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలోని 14 మండలాలకు చెందిన 218 మంది మత్స్య సహకార సంఘం సభ్యులందరికీ నైపుణ్య శిక్షణ ఇచ్చి వారిని నిజమైన మత్స్యకారులు తీర్చిదిద్దుతానని తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చి అన్ని సంక్షేమ పథకాలు మత్స్యకార కుటుంబ సభ్యులందరికీ అందేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రావు ఫీల్డ్‌ఫిషర్స్ మెన్ మహేశ్వర్ రెడ్డి, రాందాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి గాయాలు

మిడ్జిల్ : బైకు అదుపుతప్పి రోడ్డు ప్రమాదంలో మసిగుండ్లపల్లి పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ కు గాయాలైన సంఘటన మండలంలోని తమడ కుంట తండా దగ్గర చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, మచిగుండ్లపల్లి పంచాయతీ కార్యదర్శి మిడ్జిల్ నుండి మసుగుండ్లపల్లి వెళుతుండగా తమ్మడ కుంట తండా దగ్గర కోడిని తప్పిపోయే బైకు అదుపుతప్పి కింద పడడంతో గాయాలైనవి. విధులకు వెళ్తున్న అధికారులు గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు . అనంతరం స్వగ్రామానికి తీసుకెళ్లారని స్థానికులు తెలిపారు.

తల్లిదండ్రులు, గురువుల మాట..

తూచా తప్పకుండా పాటించాలి

హన్వాడ : తల్లిదండ్రులు గురువుల మాట తూచా తప్పకుండా పాటించాలని ఎస్వీఎస్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రామ్‌రెడ్డి అన్నారు . గురువారం మండలంలోని చిన్నదర్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థు లకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్వీఎస్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. అలాంటి వారే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని అన్నారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో విద్యను అభ్యసించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎం శైలజ , ఉపాధ్యాయులు , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అర్హులందరికీ కేంద్రప్రభుత్వ పథకాలు అందించాలి : మాజీ ఎంపీ

మిడ్జిల్ : పేద ప్రజల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందించడమే లక్ష్యమని పేద ప్రజలందరూ కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని పాలమూరు మాజీ పార్లమెంటు సభ్యులు జితేందర్ రెడ్డి అన్నారు.

వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని , బైరంపల్లి, కంచనపల్లి ,గ్రామంలో ఏర్పాటు చేసి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారతదేశంలో ఉన్న అట్టడుగు వర్గాల ప్రజల కోసం ఎన్నో పథకాలను ప్రజలకు అందిస్తున్నారు అని తెలిపారు. కేంద్రం తీసుకొచ్చిన పథకాలు ప్రజలందరికీ తెలిసే విధంగా అధికారులు కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో ఉండే పేద ప్రజలందరికీ కేంద్ర పథకాలు అందరికి తెలిసేలా అందరికీ అందేలా చూడడమే ఈ వికసిత భారత్ ముఖ్య ఉద్దేశ్యం అని పేర్కొన్నారు. కాబట్టి ప్రతి ఒక్క భారతీయ పౌరులు ఈ పథకాలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు ఏపీ మిథున్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లె తిరుపతి, బిజెపి మండల అధ్యక్షులు కావలి నరేందర్, ఎస్బిఐ ఫీల్డ్ ఆఫీసర్, హెల్త్ అసిస్టెంట్ సంపత్ కుమార్ ,పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి, అంగన్వాడి టీచర్, బిజెపి మండల నాయకులు బిజెపి మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సాహిత్ రెడ్డి, కంచనపల్లి ఉపసర్పంచ్ శేఖర్, మండల నాయకులు వాసుదేవ్ నాగేష్ , మహేష్ అంజి చెన్నయ్య నవీన్ బాలయ్య గొడుగు శివ మరియు గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ఉపాధి హామీ చట్టంపైనే దాడి

- ఆధార్ సంబంధం లేకుండా చెల్లింపులు జరపాలి
- సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్



వనపర్తి : గ్రామీణ ఉపాధి హామీకి ఆధార్‌ను తప్పనిసరి చేయడమంటే చట్టంపైనే దాడి చేయడమని సీపీఐ(ఎం) వనపర్తి జిల్లా కమిటీ విమర్శిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.డి.జబ్బార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిమాండ్ ప్రాతిపదికన గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎస్ఆర్ ఈజీఏ) పట్ల మోడీ ప్రభుత్వం ఇటీవల తీసుకున్న చర్యను తీవ్రంగా విమర్శిస్తున్నట్లు తెలిపారు. ఈ చర్య కోట్లాదిమంది కార్మికుల హక్కును లాగేసుకోవడమేనని పేర్కొన్నారు. పైగా ఆధార్ ప్రాతిపదిక చెల్లింపు వ్యవస్థ (ఏబీపీఎస్)కు గడువు కూడా డిసెంబరు 31తో ముగిసిందని, ఈ చట్టం కింద ప్రతి గ్రామీణ కార్మికునికి జాబ్ కార్డు హక్కు ఉంటుందని, జాబ్ కార్డు కలిగిన ప్రతి వ్యక్తికి ఏడాదిలో కనీసం వంద రోజులు పని కల్పించాల్సి ఉంటుందన్నారు. జాబ్ కార్డు కలిగిన వారిలో అర్హులైనవారు, అర్హులుకాని వారు అంటూ కేంద్ర ప్రభుత్వం విభజించడానికి పూనుకోవడమే ఈ చట్టాన్ని తొలిగా ఉల్లంఘించినట్టయిందని మండిపడ్డారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం, నమోదైన 25.25 కోట్ల మంది కార్మికుల్లో కేవలం 14.35కోట్ల మంది మాత్రమే అర్హులని, ఎందుకంటే గత మూడేండ్లలో వారు కనీసం ఒక రోజు పని అయినా చేసినందున వారికి అర్హత ఉందని, కానీ, జాబ్ కార్డు కలిగిన మహిళ గతంలో పనిచేయక పోయినా ఇప్పుడు పనిచేయాలని నిర్ణయించుకున్నట్లైతే, అమె పనిచేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎందుకంటే ఆమెను అనర్హురాలని ఎంఎస్ఆర్ఈజీఏ సైట్ ప్రకటించేసినందున ఆమె ఇక పనిచేయలేదని, మరో మాటలో చెప్పాలంటే,10కోట్ల మందికి పైగా కార్మికులను అనర్హులుగా ప్రకటించారని వెల్లడించారు. చట్టం ప్రకారం వారికి జాబ్ కార్డు వుండేందుకు హక్కు ఉందని, అయినా ఏబీపీఎస్ పొందేందుకు వారు అనర్హులైనందున ఎంఎస్ఆర్ఈజీఎస్ సైట్‌లో పనిచేసే హక్కు నిరాకరించబడిందని, అర్హులుగా ప్రకటించిన 14.35కోట్ల మంది జాబ్ కార్డుదారుల్లోనూ దాదాపు 12.7శాతం మంది అంటే దాదాపు 1.8కోట్ల మందికి ఏబీపీఎస్ లేదని, అందువల్ల వారు ఎంఎస్ఆర్ఈజీఏలో పనిచేయడానికి అర్హులు కాకుండా పోతున్నారని అన్నారు. గతంలో ప్రభుత్వం ఆన్‌లైన్ నమోదు వ్యవస్థ విధించిందని, అయితే గ్రామీణ భారతంలో అనేక ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో పని ప్రదేశాల్లో కార్మికుల హాజరు ఆమోదం పొందలేదని తెలిపారు. ఆన్‌లైన్ నమోదు లేకపోతే వారికి వేతనాల చెల్లింపును నిరాకరిస్తూ వచ్చారని, ఇదంతా చట్టంపై నిర్ద్వంద్వంగా దాడి చేయడమేనని విమర్శించారు. వంద రోజుల వరకు పరిమితి విధించడం వంటి నిబంధనలతో సంబంధం లేకుండా గ్రామీణ పేదలకు ఎంఎస్ ఆర్ఈజీఏ ఒక వరంగా మారిందని రుజువైందని అన్నారు. ముఖ్యంగా నిరు ద్యోగం వల్ల తీవ్ర ఇబ్బందుల్లో వున్న గ్రామీణ ప్రజానీకానికి ఇది కచ్చితంగా ఒక ఆశాకిరణంగా ఉందని, కానీ, మోడీ ప్రభుత్వం చట్టపరమైన అర్హతపై దాడి చేయడానికి సాంకేతికతను ఉపయోగిస్తోందని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో, ఎంఎస్ఆర్ఈజీఏ హామీ కల్పించిన కార్మికుల హక్కులపై ఇది అక్రమంగా దాడి చేయడమేనంటూ తీవ్రంగా ఖండించారు. ఆధార్ ప్రాతిపదిక చెల్లింపు వ్యవస్థకు తప్పనిసరిగా ముడి పెట్టడాన్ని తక్షణమే ఉపసంహరించాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేస్తోందన్నారు.

పెండింగ్ మెస్ బిల్లులు చెల్లించండి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.ఆది



వనపర్తి : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురుకులాల్లో గత ఐదు నెలలుగా పెండింగ్లో ఉన్న మెస్ బిల్లులను తక్షణమే చెల్లించాలని గురువారం వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా కార్యదర్శి ఎం.ఆది మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నెలకొల్పిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ట్రైబల్ వెల్ఫేర్ లలో గత ఐదు నెలలుగా 5,485 కోట్లు పెండింగ్లో మెస్ బిల్లులు ఉన్నాయని తెలిపారు. గురుకులాల్లో విద్యార్థులకు సరైన మెనూ అమలు కాకపోవడంతో పాటు నాసిరకంగా మెనూ అమలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పెండింగ్లో ఉన్న మెస్ బిల్లులు చెల్లించాలని డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మల్లేష్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి త్యాగాలు మరువలేనివి

- ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి



వనపర్తి : సమాజంలో దోపిడీ, వివక్ష, బానిసత్వం కొనసాగుతున్న పరిస్థితుల్లో సావిత్రీబాయి పూలే చేసిన త్యాగాలు ఎనలేని వని, ఆమె త్యాగాల వల్లనే నేటి సమాజానికి విద్యాహక్కు లభించిందని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రం 9వ వార్డు పరిధిలోని లక్ష్మీ నరసింహ కాలనీలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రిబాయి 193వ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి పాల్గొని నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సావిత్రిబాయి మహిళల సమస్యల కోసం బడుగు బలహీన వర్గాల కోసం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని సమాజ సేవ చేశారని గుర్తు చేశారు. జ్యోతిరావు పూలే అండదండలతో విద్యను నేర్చుకోవడంతో పాటు పదిమందికి విద్యను నేర్పించిన ఘనత ఆమెకు దక్కిందన్నారు. అందులో భాగంగానే ఐద్వా ఆధ్వర్యంలో మహిళా సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి మహిళా తన సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండి సమస్య పరిష్కారానికి సమాజ కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏ లక్ష్మి, సహాయ కార్యదర్శి రేణుక, కవిత, సాయి లీల, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

ఆత్మకూరు : ఆత్మకూరు పట్టణ , మండల పరిధిలోని ప్రజాపాలన పరిశీలనకు శుక్రవారం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వస్తున్నట్లు ఆత్మకూరు మండల అధ్యక్షులు పరమేష్, పట్టణ అధ్యక్షులు నల్గొండ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటన పేర్కొన్నారు. మొదట తిప్పడంపల్లి గ్రామంలోని ప్రజాపాలనలో పాల్గొంటారని,అనంతరం ఆత్మకూరు పట్టణంలో జాతర మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన రెండు ,ఎనిమిదో వార్డులో పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయ కులు , కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి

- అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్

నారాయణపేటటౌన్: మున్సిపాలిటీలు పరిశుభ్రంగా ఉండేలా మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్ అన్నారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ ఛాంబర్‌లో మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని మున్సిపాలిటీలలో శానిటేషన్ పనులు ముమ్మరం చేసి పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాలిటీలలోని అన్ని వార్డులలో డ్రైనేజీ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రోడ్లపై చెత్తాచెదారంవేయకుండా శానిటేషన్ పనులు చేయాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరు వేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలన్నారు.

ఆర్యవైశ్య కుటుంబానికి ఆర్థికసాయం

అచంపేట రూరల్ : అమ్రాబాద్ మండలం మొల్కమామిడి గ్రామానికి చెందిన నిరుపేద ఆర్య వైశ్యుడు కొండూరు వెంకటరమణ ఇంటిలో బుధ వారం తెల్లవారు జామున షార్ట్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదం జరిగి గృహోపకరణాల తో పాటు దుస్తులు, రూ. 2 లక్షల నగదు కాలి బూడిద అయ్యింది. మండల ఆర్యవైశ్య సంఘం ద్వారా సమాచారం అందుకున్న ఆర్యవైశ్య మహాసభ విద్యా కమిటీ చైర్మన్ మిడిదిడ్డి శ్యాంసుందర్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, మహాసభ రాష్ట్ర కార్యదర్శి విసనకర్రల చంద్రకుమార్ ఆర్యవైశ్య సంఘం నేతలు గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంఘటనపై అడిగి తెలుసుకున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో తోటి ఆర్యవైశ్య సహోదరులతో విరాళాలు సేకరించారు. ఈ మేరకు వసూలైన రూపాయలు లక్షను బాధితుడు వెంకటరమణకు తక్షణ సహాయంగా అందజేశారు. కుటుంబానికి ఆర్యవైశ్య సంఘం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో ఏ అవసరం వచ్చినా ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మహాసభ కార్యవర్గ సభ్యులు బలుసా శ్రీరాములు, సంబు వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్, అమరాబాద్, అచ్చంపేట, పదర, వెల్దండ, వంగూరు, మండలాల సంఘం అధ్యక్షులు నీల శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, బలుస వేణుగోపాల్, ఉప్పు ఆంజనేయులు, మేడిశెట్టి సురేష్, జిల్లా నాయకులు పాపిశెట్టి శ్యాంసుందర్ మాలే శంకరయ్య పాపిశెట్టి సురేష్, కందికొండ శ్రీధర్, పోలిశెట్టి నరేష్, వాడకట్టు వినోద్, గోవింద్ రమేష్ కామిషెట్టి శ్రీనివాసులు, కందూరి పాండు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ప్రజాపాలన'





ఆత్మకూరు : ఆత్మకూరు, అమరచింత పట్టణ, మండల కేంద్రాలలోని గ్రామాలలో గురువారం ప్రజాపాలన కార్యక్రమం కొనసాగింది. ఆత్మకూరు మండల పరిధిలోని మూలమల్ల గ్రామంలో 644, మరియు286 ఇతర దరఖాస్తులు వచ్చాయి, ఆరేపల్లి గ్రామంలో 742 దరఖాస్తుల రాగ ఇతర దరఖాస్తులు 5 వచ్చినట్లు ఆత్మకురు మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి ,మరియు వివిధ శాఖల సిబ్బంది ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. అమరచింత మండల పరిధిలోని నందిమల్ల లో గురువారం ప్రజాపాలన కార్యక్రమం కొనసాగింది.

కుప్పలు తిప్పలుగా దరఖాస్తులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలలో దరఖాస్తులు కుప్పలు తిప్పలుగా వస్తున్నాయి, ఇదివరకు లబ్ధి పొందిన పొందుతున్న రైతులు, పింఛను దారులు తిరిగి దరఖాస్తు చేసుకునే అవసరం లేదని చెప్పిన కొన్ని ప్రాంతాల్లో తిరిగి దరఖాస్తు చేసుకుంటున్నారు ,ముఖ్యంగా గ్రామాలలో అధిక సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి, దీనతో కేంద్రాలలోని సిబ్బందికి అధికారులకు తిప్పలు తప్పడం లేదు, అదేవిధంగా రేషన్ కార్డు కోసం దరఖాస్తు లేకపోవడంతో మేము ఎలా దరఖాస్తు చేసుకోవాలి అని ప్రజలు వాపోతున్నారు .తెల్ల కాగితం పై రాసి దరఖాస్తు రాయడానికి ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారు. ఇదివరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న పరిస్థితి ఏమిటి? ఇదివరకు ఒక రేషన్ కార్డులో ఉన్నవారు తిరిగి కొత్తగా కొందరికి రేషన్ కార్డు కావాలని కోరుతున్నారు, ఇలా అనేక సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. సహాయ కేంద్రం ఉన్నప్పటికీ ప్రజలు అధిక సంఖ్యలో రావడంతో సిబ్బందికి కూడా తిప్పలు తప్పడం లేదు.

'ప్రజాపాలన' సద్వినియోగం చేసుకోవాలి

వీపనగండ్ల : ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని మాజీ మండల రైతు బంధు అధ్యక్షులు వల్లభాపురం నారాయణ రెడ్డి, ఎత్తం కృష్ణయ్య యాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు సంక్షేమ పథకాల అమలు కోసం ప్రజా పాలన కార్యక్రమాన్ని గ్రామీణ స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని, అర్హులైన వారందరూ దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు . ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరసింహారెడ్డి ఎంపీడీ కథలప్ప పానగల్ సింగిల్ విండో మాజీ చైర్మన్ బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఉప్పునుంతల : ఉప్పునుంతల మండలం పరిధిలో గురువారం ప్రజాపాలన అభయ హస్తం ఆరు గ్యారంటీల కార్యక్రమంలో భాగంగా కొరటికల్, తిప్పాపూర్ గ్రామాలలో కొనసాగించారు. ప్రభుత్వ పథకాలకు అర్హులైన ఇతర ఫిర్యాదులు దరఖాస్తులు ఏర్పాటుచేసిన కౌంటర్లలో ఇవ్వాలని మండల ఎంపీఓ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అనురాధ, సర్పంచులు, పంచాయతీ సెక్రెటరీ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమాభివృద్ధికి కృషి చేయాలి : ఎమ్మెల్యే



నారాయణపేటటౌన్ : జిల్లాలో మహిళా శిశు సంక్షేమ అభివృద్ధికి అధికారులు, సిబ్బంది కలిసి సమన్వయంతో కృషి చేయాలని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని బాల రక్ష భవన్ లో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలను జిల్లాలో పూర్తిగా నివారించాలని వాటిని ప్రోత్సహించే వారిపై శాఖపరమైన చర్యలకు వెనకాడవద్దని తెలిపారు. బాల్య వివాహాలను అధికారులు అడ్డుకునే క్రమంలో ఏవైనా ఇబ్బందులు కలిగితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాల్య వివాహాలను ఆపడానికి వెళ్లకముందే తనకు సమాచారం ఇస్తే ఆయా గ్రామాలు, ప్రాంతాలకు చెందిన నాయకులకు సమాచారం ఇచ్చివారి సహకారాన్ని తీసుకోవాలని,ఈ విషయంలోతన సహకారం ఎప్పటికీ ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా చైల్డ్, ఎల్డర్ హెల్ప్ లైన్ ల గురించి ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించి వారిని నివారించాలన్నారు. ప్రతీ గ్రామం, ప్రతీ మున్సిపల్ వార్డులలో చైల్డ్ , ఎల్డర్ , షీ టీం హెల్ప్ లైన్ల నంబర్ల ప్రచార బోర్డులు పెట్టాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. చైల్డ్ , వెల్డర్, షీ టీం లకు బాధితుల నుంచి రోజుకు ఎన్ని ఫోన్లు వస్తున్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇక ఐసిడిఎస్ కు చెందిన సిడిపిఓలు, సూపర్ వైజర్ల గ్రామాలు మండలాల పరిధిల గురించి చర్చించారు. గ్రామాలలో అంగన్వాడి కేంద్రాల నిర్వహణను సిడిపిఓలు సూపర్వైజర్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. అంగన్వాడి ప్రీ స్కూల్ నిర్వహణలను సందర్శించి చాలా బాగుందని, ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రీ స్కూల్ లో చిన్నారులు ఎంతో చక్కగా విద్య ను అభ్యసిస్తున్నారని, అలాంటి ప్రీ స్కూల్ లు నియోజకవర్గంలో మరిన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిడబ్ల్యూసి వేణుగోపాల్ కు ఎమ్మెల్యే సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో పర్మామెన్స్ తక్కువ గా ఉన్న టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇప్పించి కేంద్రాల్లో విద్యాబోధనను పటిష్టం చేయాలన్నారు. నియోజకవర్గంలో విద్యాబోధన చక్కగా కొనసాగుతున్న అంగన్వాడి కేంద్రాలు, మధ్యస్థంగా ఉన్న కేంద్రాలు, చివరి స్థానంలో ఉన్న అంగన్వాడి కేంద్రాల జాబితా తయారుచేసి ఇవ్వాలన్నారు. అంగన్వాడి ప్రీ స్కూళ్లను మండల కేంద్రాలలో ఏర్పాటు చేయాలని, అందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఆయా మండల కేంద్రాలు, గ్రామాలలో ప్రభుత్వ భవనాలను గుర్తించి వాటి లో ప్రీ స్కూళ్లను ప్రారంభిస్తే నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చెప్పారు. నారా యణ పేట జిల్లా కేంద్రంలో కనీసం 10 అంగన్వాడి ప్రీ స్కూళ్ల ను ఏర్పాటు చేసేందుకు ఐసిడిఎస్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ధన్వాడ మండల కేంద్రం, మరికల్ మండల కేంద్రంలో ప్రీ స్కూళ్లను త్వరలోనే ప్రారంభించేందుకు తాను కృషి చేస్తానన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని భివండీ కాలనీలో మినీ అంగన్వాడి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సిడబ్ల్యూసి వేణుగోపాల్ కు సూచించారు. ఈ సమీక్షా సమావేశానికి ముందు సిడబ్ల్యుసి అధికారి వేణుగోపాల్ జిల్లా మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల శాఖ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. వాటిలో ముఖ్యంగా జిల్లాలోని నారాయణపేట, మక్తల్, మద్దూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టుల వివరాలు, వాటి పనితీరును తెలిపారు. బాల్య ప్రారంభ సంరక్షణ విద్య, బాల్య ఆరంభ విద్య నమోదు, అనుబంధ పోషకాహారం, ఆరోగ్య సేవలు, ప్రజా చైతన్య కార్యక్రమాలు, సమగ్ర బాలల పరిరక్షణ, బాలసదనం, చైల్డ్, ఎల్డర్ హెల్ప్ లైన్, సఖి కేంద్రం, సాయం పొందిన వయో వృద్ధులు, జిల్లా మహిళా సాధికారిక కేంద్రాల పనితీరు, ఉద్యోగులు, సిబ్బంది సేవలను క్లుప్తంగా వివరించారు. అంతకు ముందు ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి పట్టణంలోని సివిల్ లైన్ లో అంగన్వాడి ప్రీ మోడల్ స్కూల్ నుసందర్శించారు. ఆ స్కూల్లోని నర్సరీ, ఎల్కేజీ యూకేజీ, తరగతి గదుల్లోకి వెళ్లి చిన్నారులు చెప్పిన ఆంగ్ల అక్షర మాల, ఆంగ్ల అక్షర పదాలను విని వారి ప్రతిభ ను మెచ్చుకున్నారు. ప్రీ స్కూల్ లో పిల్లలకు అందించే పౌష్టికాహారం వివరాలనుఅడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే పట్టణంలోని సఖీ వన్ స్టాప్ సెంటర్ ను పరిశీలించి అక్కడ పనిచేసే సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. సఖీ కేంద్రం ద్వారా ఇప్పటి వరకు ఎంత మందికి సేవలు అందాయని ఆరా తీశారు. 2023 సంవత్సరంలో వచ్చిన 101 కుటుంబ కలహాల కేసుల లో 98 కేసులను పరిష్కరించినట్లు సఖీకేంద్ర కౌన్సిలర్ ఎమ్మెల్యేకు వివరించారు. తర్వాత కేంద్రంలోని షీ టీమ్, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, వారి పనితీరు పై ఎమ్మెల్యే చర్చించారు. ఎమ్మెల్యే పట్టణంలోని అనాథ, వయో వృద్ధుల బాల సదనం కేంద్రాన్ని పరిశీలించి అక్కడ ఆశ్రయం పొందుతున్న అనాథ చిన్నారులను కలిసి వారిని ఆప్యాయంగా పలకరించారు. అందరూ మంచిగా చదువు కోవాలని ఏమైనా ఇబ్బంది కలిగితే తన వద్దకు వచ్చి చెప్పాలని ఆ చిన్నారులకు సూచించారు. బాలసదనంలోనే అనాథ బాల బాలికలతో కలిసి ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి సహపంక్తి భోజనం చేశారు. భోజన విరామ అనంతరం తనకు గిఫ్ట్ గా వచ్చిన మొక్కలన్నింటి ఎమ్మెల్యే బాల సదనం ఆవరణలో నాటారు. ఈ సందర్భంగా అనాథ చిన్నారులు చేసిన నృత్యాలను ఎమ్మెల్యే మెచ్చుకుని చిన్నారులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సిడబ్లుసి వేణుగోపాల్, సి డి పి వో లు, సూపర్ వైజర్ లు, అయా విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అజ్జకోలులో ప్రభుత్వ భూములను కాపాడండి

- ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించిన సీపీఐ(ఎం) నాయకులు



మదనాపురం : మదనాపురం మండలంలోని అజ్జకొలు గ్రామానికి చెందిన ప్రభుత్వ భూములను కాపాడాలని సీపీఐ(ఎం) నాయకులు కోరారు. గురువారం గ్రామంలో జరిగిన ప్రజాపాలనకు వచ్చిన దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డికి వినతి పత్రం అందించి మాట్లాడారు. 314, 315సర్వే నెంబర్ లో 1ఎకర31గంటల ప్రభుత్వ భూమి ఉందని, కొంత మంది వ్యక్తులు కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. అదేవిదంగా ఊరతిప్ప సర్వే నెంబర్ 321లో దాదాపు 38ఎకరాలు, నెమళ్ళ తిప్పలోని 167,168 సర్వే నెంబర్ లో 48 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని గుర్తు చేశారు. అందులో అక్రమంగా పట్టాలు చేసుకున్నారని అలాంటి వాటిని రద్దు చేసి ప్రభుత్వ ఉపయోగం కోసం ఉపయోగించాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వెంకట్ రాములు, నాయకులు విష్ణు, చెన్నయ్య మొగిలి, చిరంజీవి, మాసన్న, మన్యం తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని వినతి

వీపనగండ్ల : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని డాక్టర్ వంశీకృష్ణకు సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వర్గ సభ్యులు మురళి మాట్లాడుతూ ఉమ్మడి మండల గ్రామాల ప్రజలకు అంబులెన్స్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుందన్నారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంజూరైన అంబులెన్స్ ను వనపర్తికి తరలించడం జరిగిందని, దీంతో అంబులెన్స్ సౌకర్యం లేక అనారోగ్యానికి గురైన బాధితులు అంబులెన్స్ లేకపోవడంతో చనిపోవడం జరిగిందన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, పాలకులు స్పందించి అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకులు ఆశన్న, ఈశ్వర్ రామకృష్ణ నవీన్ పాల్గొన్నారు.





పారిశుద్ధ్య కార్మికులకు .. ఇన్సూరెన్స్ కార్డులను అందజేత

పెబ్బేరు : ప్రజాపాలనలో భాగంగా గుమ్మడం గ్రామానికి వచ్చిన వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన గాండ్ల శ్రీనివాస్ తన సొంత ఖర్చులతో ఆరుగురు పారిశుధ్య కార్మికులకు ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ద్వారా రూ.10 లక్షల బీమా పాలసీ ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామీణ ప్రాం తాల్లో గ్రామీణ ప్రజల కోసం పోస్టఆఫీస్ వివిధ రకాల పథకాలను అమలు పరుస్తుందని, వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పారిశుధ్య కార్మికులకు ఇన్సూరెన్స్ ఇవ్వటంలో సహకరించిన గాండ్ల శ్రీనివాస్‌కు సభాముఖంగా ఎమ్మెల్యే అభినందించారు. పోస్ట్ ఆఫీస్ సేవలను వినియోగించుకోవాలని అన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



పెబ్బేరు : పెబ్బేరు పురపాలక కేంద్రంలో కేడీర్ గ్రూప్ అండ్ వెంచర్ నిర్వాహకులు కాంగ్రెస్ నాయకులు కే దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి ఆవిష్కరించారు.. బుధవారం పురపాలక కేంద్రంలో కేడీర్ గ్రూప్ అండ్ వెంచర్ ఆఫీసులో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దయాకర్ రెడ్డి ఎమ్మెల్యేని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అక్కి శ్రీనివాస్ గౌడ్, రామచంద్రారెడ్డి, విజయవర్ధన్ రెడ్డి, వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్, భాను ప్రకాష్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, హరి శంకర్ రెడ్డి, వెంకటరమణ, రవీందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సన్మానం



పెబ్బేరు : ఉమ్మడి మండలం షేర్‌పల్లి గ్రామానికి చెందిన కొండయ్య భాగ్యమ్మల కుమార్తె నందిని కబడ్డీ పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికైంది. డిసెంబర్ 23వ తేదీన బిజినపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన అండర్ 17 జిల్లా స్థాయి కబడ్డీ పోటీలలోక ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ విషయం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామంలో ప్రజా పాలన కార్యక్రమానికి హాజరై వస్తు మార్గమధ్యలోని మాంటిస్సోరి పాఠశాల వద్దకు చేరుకొని క్రీడాకారిణిని సన్మానించారు.విద్యార్థిని నందినిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా అయన విద్యార్థినికి శాలువా పూలమాలలతో సత్కరించారు. క్రీడాకారిణికి ఉత్తమ శిక్షణ ఇచ్చిన పిఈటి మహేష్ యాదవ్ను సైతం ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మండల నాయకులు శ్రీనివాస్ గౌడ్, సురేందర్ గౌడ్ వెంకటరమణ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సౌకర్యం కల్పించాలి : ఎస్ఎస్ఐ



ఆత్మకూరు : పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర పాఠశాలలు గురు వారం ఎస్ఎఫ్ఐ భారత విద్యార్థి ఫెడరేషన్ విద్యార్థి సంఘం పరిశీ లించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహా కార్యదర్శి కే రాఘవ మాట్లాడుతూ పాఠశాలలు విద్యార్థులకు తాగునీరు లేక ఉప్పుగా ఉండటం వల్ల చాలా మంది విద్యార్థులకు బయటకు వెళ్లి వస్తున్నారని, నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని, మూత్రశాలలు సరిపడా లేవని వాటిని ఏర్పాటు చేయాలని, స్వీపర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు రమేష్ నాయకులు కుమార్ ,అంజి, కృష్ణ, రాకేష్ , సందీప్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

- సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్

పెద్దకొత్తపల్లి : 2023 - 24 సంవత్సరం నాటికి పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులే సీ ఓ ఈ అర్హులు అని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి దరఖాస్తులను ఈ నెల 15వ తేదీ లోపల ఆన్లైన్లో రూ.200ల రుసుము చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని, దరఖాస్తులు చేసుకునే విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసి, కి చెందిన విద్యార్థులు 31/8/24 నాటికి 17 సంవత్సరాలు నిండి ఉండాలని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే ఈ ఫోన్ నెంబర్‌ను 79 95010618ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి



కందనూలు : ఎస్.పీ.ఆర్.డీ. ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల బాలీశ్వర్ మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ 1809 జనవరి 4 తేదీన పారిస్ లోని క్రూవే గ్రామంలో మోనిక్ బ్రేయిలీ సైమన్ రెన్ బ్రెయిలీ దంపతులకు జన్మించాడని, బాల్యంలోనే ప్రమాదవశాత్తు రెండు కళ్లు కోల్పోయి అంధుడిగా మారాడని తెలిపారు. పారిస్ లో వాలెంటైన్ హ్యూ ప్రారంభించిన అంధుల పాఠశాలలో ఆయన చదువు కుని, బ్రేయిలీ 17 వ సంవత్సరంలోనే అదే పాఠశాలకు ప్రొఫెసర్గా నియమితులయ్యారని తెలిపారు. బ్రెయిలీ లిపి కనిపెట్టడంతో ఎంతోమంది దృష్టిలోపం కలిగిన వికలాంగులు చదువు నేర్చుకుని జీవితాలు మార్చుకున్నారని అన్నారు. బ్రెయిలీ జీవితం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బీ. వెంకటయ్య, సీహెచ్ లింగం గౌడ్, కె. స్వామి, జి. ఆంజనేయులు, పీ. లక్ష్మణ్ అంజి, శివ తదితరులు పాల్గొన్నారు.

'ఆటో కార్మికులకు ఉపాధి కల్పించాలి'



కందనూలు : మహాలక్ష్మి పథకం ఉచిత ప్రయాణం పేరుతో నష్టపోయిన రవాణా రంగా ఆటో కార్మికులకు ఉపాధి చూయించాలని తెలంగాణ పబ్లిక్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పొదీల రామయ్య జిల్లా అధ్యక్షులు కురుమూర్తి ఉపాధ్యక్షులు శివ కోరారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే నెలకు రూ. 12 వేల రూపాయల భృతి ఇవ్వాలని, వారి రక్షణ కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో సైదులు సుధాకర్ ఆటో కార్మికులు పాల్గొన్నారు.

నూతన జిల్లా కమిటీ ఎన్నిక



కందనూలు : తెలంగాణా ప్రైవేట్ జూనియర్ కళాశాలల మేనేజ్మెంట్ నాగర్కర్నూల్ జిల్లా సభ్యులు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బీ. సాంబయ్య . నిరంజన్ జనరల్ సెక్రటరీగా కోశాధికారి గా ఎమ్. ప్రకాశరెడ్డి స్టేట్ ఈసీ మెంబెర్ గా స్. శ్రీనివాసగౌడ్ ను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కె . మురళీధర్ రావు, పి శ్రీనివాస్, ఎమ్. సత్యం, తీగల సునీందర తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నోడల్ ఆఫీసర్‌ను కలిశారు.

ఇంటింటికీ అక్షింతలు



ఉప్పునుంతల : ఉప్పునుంతల మండలంలోని వెల్టూర్ గ్రామంలో గురువారం అయోధ్య రామమందిర్ పరమ పవిత్రమైన పూజిత అక్షింతల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి అక్షింతలు అందజేశారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతతో మెలగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వేణుగోపాల్ రెడ్డి, జంగరావు, కృష్ణ రెడ్డి, వెంకట్ రెడ్డి, రాజు, మల్లయ్య, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



వంగూరు : వంగూరు మండల ఉపాధ్యాయ శాఖ ఆధ్వర్యంలో ఎంఆర్సీ భవనం వద్ద గురువారం మండల విద్యాశాఖ అధికారి శంకర్ నాయక్ ఎస్‌జీటీయూ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌జీటీయూ మండల అధ్యక్షులు చెన్నకేశవులు ఉపాధ్యాయుల సమస్యలపై ప్రసంగించారు. ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ ఎల్లప్పుడు ముందుంటుందని, సమస్యల సాధనకై పోరాడుతామని జిల్లా బాధ్యులు రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో, ప్రధాన కార్యదర్శి రమేష్ , జిల్లా కార్యదర్శి రాజేందర్, శశాంక్ రెడ్డి మరియు సంఘ సభ్యులు శ్రీధర్ భూపాల్, మహేష్, సహదేవ్ , అరుణ, లక్ష్మిబాయి, భవాని ప్రభావతి, సునీత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

అచ్చంపేట రూరల్ : మదర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం అచ్చంపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఎయిడ్స్‌పై కళాబృందంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్మల, రజిత, అసీనా తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల ఇరుముడి

వెల్దండ : మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద శుక్రవారం అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమం ఉంటుందని గురు స్వాములు అన్నదానం సంతోష్ , జంగయ్య , శ్రీనివాస్ రెడ్డి లు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఇరు ముడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అయ్యప్ప పూజలు వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని సింగల్ విండో వైస్ చైర్మన్ సంజీవ్ కుమార్ ఏర్పాటు చేస్తున్నట్టు వారు తెలిపారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



కందనూలు : ఎస్‌టీయూ డైరీ, క్యాలెండర్ జిల్లా మంత్రి జూపల్లి కృష్ణారావుతో , నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ , కలెక్టర్ ఉదయకుమార్ చేతుల మీదుగా గురువారం ఎస్‌టీయూ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎం పర్వత్ రెడ్డి , రాష్ట్ర అసోసియేటు అధ్యక్షులు కొత్త శ్రీధర్ రావు రాష్ట్ర అదనపు కార్యదర్శి ఈశ్వరయ్య రాష్ట్ర కార్యదర్శి కె రమేష్ జిల్లా అధ్యక్షులు సంఘం మురళి ప్రధాన కార్యదర్శి మామిళ్ళ సుదర్శన్ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ హరిప్రసాద్ జిల్లా నాయకులు సింగోటం గోపాల్ రెడ్డి నందకిషోర్ సత్యనారాయణ కరుణాకర్ రెడ్డి నరసింహ నారాయణ గౌడ్ జిల్లా మైనార్టీ నాయకులు జమీల్ అహ్మద్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ మధుసూదన్ రెడ్డి కే సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ప్రజాపాలన' గ్రామసభలు

కొల్లాపూర్ రూరల్ : కొల్లాపూర్ మండలంలోని మాచినేని పల్లి గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశానుసారం ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. ఈ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన అభయ హస్తం గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరూ మహాలక్ష్మి రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి, చేయూత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జడ్చర్ల : తెలంగాణ రాష్ట్రం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అభయ హస్తం 6 గ్యారంటీల పథకం ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజల నుండి దరఖాస్తుల స్వీకరించడం జరుగుతుంది అర్హులైన లబ్ధిదారులందరూ దరఖాస్తు చేసుకుంటున్నారు. గురువారం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 24 వ వార్డులో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని లబ్ధిదా రులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఫారాలు పూర్తి సమాచారాన్ని క్లుప్తంగా పరిశీలించి దరఖాస్తు చేయించారు. ప్రజాపాలన కార్యక్రమంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పెద్దకొత్తపల్లి : రాష్ట్ర ప్రజలు గత పదివేల నిరంకుశ పాలనను ఓడించి పేదవారు పేద వర్గాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేసే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించారని జెడ్పీటీసీ మేకల గౌరమ్మ చంద్రయ్య యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని మారేడు మాన్ దిన్నే గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలనుసారం మారేడు, మాన్‌దిన్నే గ్రామంలో ప్రజా పాలన ఏర్పాటు చేసి దర ఖాస్తులు స్వీకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ లాగా మాటల ప్రభుత్వం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వం అని , పేద ప్రజల అభివృద్ధి కోసమే ప్రియతమ నేత సోనియమ్మ తెలంగాణ అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వాన్ని ఇచ్చి నియంత పాలనను పారదోడుగడానికి ఆరు గ్యారెంటీ పథకాలతో ముందుకు వచ్చిందని అట్టి ఆరు గారెంటీలను అమలు చేసి ప్రజల మెప్పును పొందుతామని అన్నారు. ప్రజాపాలనకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని సోనియమ్మ ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేసి ప్రజా ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయమని హామీ ఇచ్చారు. అలాగే గ్రామ సర్పంచ్ గన్నోజు సునిత శ్రీ కృష్ణ చారి ,జెడ్పీటీసీని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య ,సర్పంచ్ గన్నోజు సునిత శ్రీ కృష్ణ చారి ఉప సర్పంచ్ శ్రీదర్ రావు , ఎంపీటీసీ మంగమ్మ అమ్మ నాయక్ , మాజీ ఎంపీటీసీ తమటం వెంకటస్వామి గౌడ్ , మాజీ సర్పంచ్ వీరపాగ అరవింద్ , సింగిల్ విండో డైరెక్టర్ బాలు నాయక్ , ప్రజా ప్రతినిధులు సీనియర్ నాయకులు, యువకులు , గ్రామస్తులు పాల్గొన్నారు.



కొల్లాపూర్ రూరల్‌లో..

వెల్దండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రవికుమార్ , ఎంపీటీసీ మోతిలాల్ నాయక్ ,సర్పంచ్ పత్య నాయక్‌లు అన్నారు. గురువారం మండలంలోని చౌదర్ పల్లి, రాగాయపల్లి , ఘను గట్టు తండా గ్రామాలలో అధికారులు ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ.. పేదప్రజల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమం చేపట్టిందని అన్నారు. పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలని కోరారు. ఈ కార్యక్ర మంలో ఆర్ ఐ శంకర్ , సర్పంచులు గాలమ్మ , అచ్చాలు ,అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లిలో..



వెల్దండ లో..



జడ్చర్లలో..

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డీ. కిరణ్



జోగులాంబ గద్వాల : మార్చి 12న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డి కిరణ్ పిలుపునిచ్చారు బుధవారం పట్టణంలోని శ్రీవిద్య జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సుంకులమ్మ మెట్టు వీధిలలో కమిటీలు ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణకై విద్యారంగ కాషాయీ కరణకు వ్యతిరేకంగా మార్చి 12న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తూ వాటికి అరకొరగా నిధులు కేటాయించి పరిశోధనకు సరైన సమయంలో నిధులు కేటాయించకుండా బోధన బోధనేతర సిబ్బందిని నియమించకుండా విద్యా సంస్థల కాషాయీకరణకు పునుకుంటుందని విమర్శించారు విద్యారంగ ప్రైవేటీకరణ వల్ల బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్యా అందనంత దూరంలో ఉండి సామాజిక అసమానతలు పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వ విద్యా రంగ బలోపేతం ద్వారానే సమాన అవకాశాలు కల్పన జరుగుతుందన్నారు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీ ఇచ్చిన విధంగా వెంటనే 20000 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మూత పడిన ప్రభుత్వ పాఠశాలలను వెంటనే ప్రారంభించాలని అదనపు గదులను నిర్మించి విద్యార్థుల సంఖ్య కు అనుగుణంగా కనీసం మౌలిక సదుపాయాలు కల్పించాలని సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను భర్తీ చేసి పట్టణంలోని కళాశాల వసతి గృహాలకు సొంత భవనాలు నిర్మించాలని ఇతర సిబ్బంది నియమించాలని డిమాండ్ చేశారు జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన రాజోలి కేటీదొడ్డి ఎర్రవల్లి మండలాల్లో జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు గత కొన్ని సంవత్సరాలుగా నత్తనడకన సాగుతున్న ఐటిఐ భవనాన్ని వెంటనే నిర్మించి ప్రారంభించాలని డిమాండ్ చేశారు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐఆధ్వర్యంలో జరిగే పోరాటాలలో విద్యార్థులు భాగస్వాములు కావాలని కోరారు ఈ కార్యక్రమంలో వంశీ సూర్య మహేష్ కుమార స్వామి నరేందర్ రాజకే ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు శుభాకాంక్షలు

పెద్దకొత్తపల్లి : నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ ఉదయ్ కుమార్‌ను పెద్దకొత్తపల్లి ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంబడి వెన్న చర్ల ఎంపీటీసీ రవికుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,పెద్దకా రుపాముల భీరం, సుదర్శన్ రెడ్డి,సొంట్టే ప్రవీణ్ కుమార్, జంగం పెద్ద రాజ పాల్గొన్నారు.

ఒలంపియాడ్ పరీక్షలో..
శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ



కందనూలు : నాగర్ కర్నూల్ , స్థానిక ఈశ్వర్ కాలనీలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థిని విద్యార్థులు నవంబర్ నెలలో నిర్వహించిన లెవెల్-1 ఒలంపియాడ్ పరీక్షలో పాల్గొని లెవెల్-2 కి 106 మంది విద్యార్థులు అర్హత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ రాజీవ్ ప్రియదర్శన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం భాస్కర్ రెడ్డి, కో ఆర్డినేటర్ మధుసూదన్, డీన్ శివకుమార్ మరియు ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు ఒలంపియాడ్ పరీక్ష ప్రాముఖ్యతను తెలియజేసి విద్యార్థులను అభినందించారు.

నేడు తిరుమలగిరికి ఎమ్మెల్యే రాక

వంగూరు : ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వంగూరు మండలంలోని తిరుమలగిరి గ్రామానికి శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ వస్తున్నట్లు స్థానిక ఎంపీడీవో విజయభాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాపాలన గ్రామసభల్లో అభయస్తం దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. మండల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

బాధితుడికి పరామర్శ

పెద్దకొత్తపల్లి : మండలంలోని వెన్నచర్ల గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ జీ. పర్వతాలు అనారోగ్య రీత్యా హైదరాబాదులోని అ శ్వని హాస్పిటల్ థైరాయిడ్ ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొందు తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ హైదరా బాదులోని ఆసుపత్రికి చేరుకొని బాధితులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి ఆత్మ స్థైయిరాన్ని కల్పించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ఎంపీపీ వెంబడి పెద్దకొత్తపల్లి మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బాలస్వామి పాల్గొన్నారు.



ప్రజా సేవకుడిగా పనిచేస్తా : ఎమ్మెల్యే



పెబ్బేరు : ప్రజల సేవకుడిగా, ఒక బిడ్డగా ప్రజలకు సేవ చేస్తానని వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి అన్నారు. గురువారం పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లి, గుమ్మడం గ్రామాలలో జరిగిన ప్రజా పాలనలో పాల్గొన్నారు. దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చిన ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా పాలనలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల మేరకు ఇప్పటికే రెండు పథకాలను అమలుపరచామని, మిగిలిన నాలుగు పథకాలను కూడా 100 రోజులలోపు అమలుపరిచి ఇచ్చిన నిలబెట్టుకుంటామని హామీ ఇచ్చారు. గత పాలనలో పాలకుల అవినీతి ,ఆక్రమణలు, భూకబ్జాలు , అక్రమంగా సంపాదించిన వారి నుండి తిన్నదంతా కక్కిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. త్వరలో శ్రీశైలం నీటింపు నిర్వాసితులకు కూడా ఉద్యోగాలు ఇవ్వడానికి కృషి చేస్తామన్నారు. గ్రామానికి రెండు మూడు రోజుల బస్సు సౌకర్యం, ఇల్లు లేని వారికి గృహ నిర్మాణానికి రూ. 5 లక్షల రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఈఈ మెగా రెడ్డి, సర్పంచులు సుజాత, సువర్ణ, రవీందర్ నాయుడు, జేఏసీ కన్వీనర్ గాండ్ల శ్రీనివాస్,అక్కి శ్రీనివాస్ గౌడ్, విజయవర్ధన్ రెడ్డి, వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్, రంజిత్ కుమార్, జిల్లెల్ల వెంకటరా మిరెడ్డి, కావలి కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కృషి : కలెక్టర్ సంతోష్



జోగులాంబ గద్వాల : జోగులాంబ గద్వాల జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని , జిల్లా అధికారులు సహకరించాలని కలెక్టర్ బీ.ఎం. సంతోష్ అన్నారు. గురువారం ఐ.డీ.ఓ.సీ కార్యాలయంలో నూతన కలెక్టర్ బి.ఎం. సంతోష్ ను అదనపు కలెక్టర్లు అపూర్వ చౌహాన్ , చీర్ల శ్రీనివాసులు (రెవెన్యూ) మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఛాం బర్‌లో జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగ తం పలికారు. ఈ సందర్భంగా నూతన కలెక్టర్‌గా పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేరేలా ప్రభుత్వ అధికారులు కృషి చేయాలని తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా విద్య, వైద్యంలో వెనుకబడి ఉన్నందున , విద్యా వైద్యం లో జిల్లా ను ముందుకు తీసుకువెళ్లేందుకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ప్రత్యేక చొరవ తీసుకుంటానని నా వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. గతంలో వనపర్తి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నందు శిక్షణ పోదినందున జోగులాంబ గద్వాల జిల్లా పై అవగాహన ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు అపూర్వ్ చౌహాన్, చీర్ల శ్రీనివాస్, ఆర్ డి ఓ చంద్ర కళ, ఏ ఓ బద్రప్ప, జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.